


# ॥ ఆదికావ్యక్ ఓపెన్స్ విత్ విడో రిమూరియేజ్ ॥

డామిడ్ ! కథడ్డం తిరిగిందివాయ్ వెంకటేశం. రాత్రి మీ ఫాదరింటి కొచ్చేసరికి రెండు ఝూవు(లై వుంటుంది. నువు మాంఛి గాఢనిద్రలో వున్నావు. ఇవాళ మంచిరోజుగదా

---

గిరీశం లెక్చర్లు

యలాగయినా మన బైస్కోపు సంగతి తేల్చేద్దావఁని, ఆయనతో ఇంకా భోంచెయ్యలేదూ తమకోసఁవే కూర్చున్నానూ అవట్టానైప్పి, రెండో విడత ఆవకాయా పొడిమెతకులూ మింగడానికి వడిగట్టాను. ఆయన బంతిని కూచుంటే, నేచ్చుక్క గట్టిగా విదపడానిగ్గని, పెరుగుబిళ్ళ వెయ్యడానిగ్గని, అత్తగారికి సొతంత్రం లేదు గదా. ఇహ నా దురవస్థ చెప్పేదేవుంది. మీనాన్న కోపంలా, మీ అక్క హృదయంలా, 'కావలనుకున్న ' ప్రధాని మనసులా, ధరలలా, గిట్టని వాళ్ళమధ్య పచ్చిగడ్డిలా అజ్జెంచాల్నీ ఆవకాయ దెబ్బకి నోరు భగ్గుమంది. అలాగే అనురునురంటూ సబ్జెట్టు కదలేసి ఇలా బైస్కోపు తియ్యడానికి పదిహేనొందలు చాలూ మిగతా నాలుగు లక్షలూ డిస్ట్రిబ్యూటర్ దాఖలు చూసుకుంటాడూ-- ఏతావాతా మనకేవిటయ్యా ఎక్స్ట్రా ప్రాఫిటూ అనగా--మన వెంకటేశానికి రంగున హీరో వేషం వచ్చేస్తుందీ అన్నాను. ఏదీ ఏదీ అబ్బిగాడికా వాడి బొంద అన్నాడాయన-- యంతమాటా. కన్న తండ్రులు గాబట్టి తవఁరి దృష్టికి అబ్బిగాడే కావచ్చు. కాని అస్మదాదులకూ, ముజ్జగాలకూ వాడు ఫ్యూచర్ హీరో--రాబర్టెయలరూ, చార్లెను లాటనూ, గ్రీరు గార్సనూను. వాడు రేపు లక్షలార్జిస్తాడూ అంటూ ధోరణి ఫోర్తుగేరుకి ఎక్కించేసరికి-- ఛీ ఛీ-- వంటింటిలోనూ తిండిదగ్గిరా కూడా ఈ పాడు ఇంగ్లీషు కూతలేనా అంటూ ఛర్రుమన్నాడు. నేను తగ్గి మళ్ళా 'పదిహేనువందల' పల్లవికొచ్చాను. ఈ శషభిషలేం కుదరవూ. మాయింటావంటా లేవీ బయస్కోపులు, అబ్బిగాడు లక్ష లార్జించినా మాన్నా-- నాదగ్గిర మాత్రం ఇంత గరళమ్మింగడానిక్కూడా ఏగాని డబ్బులేదూ అన్నాడు. అంతట పాపం...మీ సిస్టర్--దట్ పూర్ బ్యూటిఫుల్ యంగ్ విడో బుచ్చమ్మ చల్లగిన్నె తెచ్చుక్కడపెడుతూ, పోనీ నన్నమ్మిన పెర్ఫునివిఁది వందల్లోంచీ ఇవ్వరాదా! అందోయ్, అంతే. మీ ఫాదరు వీరభద్రుడై పోయి చల్ల తప్పేళానమాంతం ఆమె నెత్తిన బోర్లించి లేచ్చక్కాపోయాడు. దేర్ గోస్ అవర్ సినీ ప్రాజెక్ట్ అనుకుని విస్తట్లోది కానిచ్చి చెయి గడుక్కున్నానన్నేను. తెల్లవార్లూ నిద్దర్లేదనుకో. సరే రాబర్టు బ్రూసంతవాడు ఏడుసార్లు సాలెగూడు కట్టాడూ. మనవెంతా అనుకుని. నాకు మాడెస్టీ మహాలావులే--ఉదయవేఁ మరో ఎస్సాల్ట్కి సిద్ధపడ్డాను. శాస్త్రకారుడేవన్నాడూ ఇట్నించి కాపోతే, అట్నించి నరుక్కురా అన్నాడు.

అందుకని సినిమా వదిలేసి నాటకాలకని చెప్పో రస్పావేస్తే--దాన్నిగదరగ ఫిఫ్టీన్ డేస్ సిగార్స్‌కి జరుగుబాటు సందర్భపడదా అనుకుని, పొద్దుటే మీ ఫాదరరుగుమీద కూచుని దంతధావనం చేస్తూ వుండగా-'కావ్యేషు నాటకం రమ్యమ్' అన్నాను జనాంతికంగా... పరగడుపునే సంస్కృతమ్ముక్క కక్కేసరికి ముసలాడు బుర్ర రంగున తిప్పి, మీకు దేవ భాషలో కూడా ప్రవేశం వుందా యేవిషీ అన్నాడు. నేను పకాలున నవ్వి--ప్రవేశవేవిఁటి స్వామీ! భాస, భవభూతి, కాళిదాసాదుల నాటకాలు యావత్తున్నూ పఠ్మెనివిదో యేటికే భట్టీయం వేసినవాణ్ణి. అంతటితో అక్కుండా ఆ నకలాన్నీ ఆంగ్లభాషలోకి డబల్‌యూ షేక్స్‌పియర్ అను కలం పేరుతో తర్జుమాయించి, అచ్చొత్తించాను--కావలిస్తే చూసుకోండి అంటూ అరుగుమీద సంసిద్ధముగా వుంచుకున్నట్టి బైండు బుక్కులు ముందుకు నెట్టేశాను.ముసలాడు డంగయి పోయాడంటే నమ్ము. ఇదే ఛాన్సని పుంజుకుని, ప్రస్తుతం తెలుగులో సాంఘిక నాటక రాజమొకటి రచించి, పరిషత్తుక్కట్టిస్తానని, అందులో అబ్బిగాడిచేత వేషం కట్టిస్తినా అటు ఆయొక్క స్కిృప్టుని, అబ్బిగాణ్ణి కూడా సినీమా వారు ఎగరేసుకు పోతారనీ, ఆశ చూపించాను.

లెక్చరంతా విన్నాక ఇంతకీ ఏవి షంఛారు అన్నాడు అనుమానంతో. మరేం లేదు ముందు నాటకం వ్రాయడానికో అర్ధ రీము ఫుల్‌స్కేపు రావులూ, ఆపైన రిహార్సళ్ళకి సాదరు ఖర్చులూ అంటూ ఆరంభించేసరికీ--శివాలెత్తినట్టు లేచిపోయాడోయ్.

నువ్వేదో బుద్ధిమంతుడివనుకున్నాను. ఇదా నువ్వు చేసే పనీ నాటకం రాయాలనుకుంటే లక్షణంగా ఓ తాడిచెట్టు ఆకు దింపిస్తాను. మా తాతగారి ఘంటం వుంది రాసుకో. కుర్రాడిచేత భట్టీయం వేయించు. అంతే తప్ప కోర్టర్జీలకు వాడుకునే తెల్లకాయితాల్నిలా తగలేస్తావా అంటూ తగులుకున్నాడోయ్. మై గాడ్. హౌ బార్బేరియన్. తాటాకులమీద రాయాల్ట. కళాపోషణిలా అఘోరిస్తూ వుంటే--ఇక నాటకాలూ సినీమాలూ ఎలా బాగుపడేడుస్తాయనీ--మాటాడవేం?

...అహ వద్దొద్దు...నువ్వలా సైలెంట్‌గానే కూర్చో...వదినగారు బావిలో నీళ్లు తోడుతున్నారు. మార్నింగ్ బ్యూటీని వక పక్క స్టడీ చేస్తూ నీకు నాటకశాస్త్ర రహస్యం

వుపదేశిస్తాను...అహా...ఒహో... చూశావుటోయ్. మీ సిస్టర్ అలా బావిలో చేదవేసి--లోకంలో నాకు చీకూ చింతా లేదూ అన్న భంగిమలో నీరు తోడుతూందే గాని--ఆవిడలోని అగ్ని పర్వతాలన్ను, క్షణం క్రితం భావిలో పడిన ఆ యొక్క మంచిముత్యం వంటి కన్నీటి బొట్టు వెల్లడిచేసిందోయ్. ఆహా...దట్ మై డియర్ వెంకటేశం--ఈజ్ డ్రామా...చూసేందుకు కళ్లుంటే సృష్టంతా డ్రామావే కదుటోయ్. అడివిగాచిన వెన్నెలనీ, ఎడారిలో పన్నీటినీ ఆ కన్నీరు స్ఫురింపచేస్తోంది...ఆవిడ భావిలోంచి తోడేది నీరుటోయ్! యంత మాత్రం కాదు--అది భూమాత కన్నీరు. లోకంలోని యంగ్ విడోస్ గురించి--ముఖ్యంగా శాపవశాత్తు ఈ అగ్గురారం ఛాదస్తుడింట పడిన దేవకన్యవంటి బుచ్చమ్మ గురించి భూదేవి దుఃఖించి రాల్చిన కన్నీళ్ళోయ్ ఆ భావిలోవి. అదుగో ఆచెట్టుమీద పిట్టలజంట ఏమ్మాటాడుకుంటోంది తెలుసా ...ఓపిల్లా--నీకేం భయం లేదు. అదిగో ఆ భావి దగ్గర చిన్నది కూడా నీలాటి యంగ్ విడోనే...నేడో రేపో... చదువు సంస్కారం గల ఒక నవ యువకుడితో వెళ్లిపోతోందీ, నువ్వుకూడా నాతో వచ్చెయ్యి అంటోంది.

ఆ? ఏవిటన్నారూ వదినా...పిట్టల్లో కూడా వితంతువులుంటాయ్యా అంటున్నారా? యంతమాట. ఆదికవి వాల్మీకి వ్రాసిన ఆదికావ్యం రామాయణంలో కథారాంభం ఇదే కదండీ. బోయవాడు క్రౌంచ పక్షుల మిథునంలో మొగదాన్ని కొట్టి చంపగానే ఆయన మానిషాద! ఓరి కిరాతకుడా ఎంత పని చేశావు--ఇప్పుడు వితంతువయిన ఆ యంగ్ విడో గతేవిటి అంటూ శోకించి శ్లోకించాడు. మన మొదటి గ్రంథమే విడో రిమారియేజ్ తో స్టార్టయింది. అయనంతగా ఘోషించినా ఆ పక్షి మీలాగే చాదస్తం కొద్దీ రెండో పెళ్ళికి ఒప్పుకోలేదు. అందుకే తరవాతి కథలో ఆయన ఆ కథ గురించి ఎక్కడా రాయలేదు. అందువల్ల--

...ఏవిటీ, ఆలాటి విషయాలు వినడం మీకు సయించదా...చూశావా వెంకటేశం... దిస్ అగెయిన్ ఈజ్ డ్రామా--నోరు నవ్వితే నొసలు వెక్కిరించిందన్నట్టూ-ఆవిడ అనేది వేరు, అనుకునేది వేరు. షేక్స్పియర్ ఊరికే అన్నాడటోయ్ ఆల్ ది వాల్డ్ జెస్టేజనీ--ప్రపంచమే ఒక నాటక రంగం. ఆవిడ వెళ్లిపోయింది కాబట్టి ఇక నీకు

అనర్గళంగా నాటకాల మీద లెక్చరిస్తాను. నోటుబుక్కు తీసుకో. నాటకాలు లక్ష వెరైటీస్. ఒకటి సంస్కృత నాటకాలు...మనం గొప్ప చెప్పుకునేందుకే తప్ప చదువు కుందుకని రాసినవి కావు. ఒక ముక్క కూడా అర్థం కాదు. రెండు సీమ నాటకాలు అనగా ఇంగ్లీషు, ఫ్రెంచి, ఇటాలియన్, జర్మన్ వగైరా దొరల భాషవి. ఇవి చదివి ఇన్స్పైయిర్ కావడానికి--అనగా చెక్కేయ్యడానికి, ముఖ్యంగా తెలుగు వాళ్ళకోసం రాసినవి.

వీటిలో పరిషన్నాటకాలు, రేడియో నాటకాలు, రూపకాలు, సినిమాలు వగయిరాలు.

ఇవికాక సినిమా స్క్రిప్టుల్లా ముందేమీ రాసుకోకుండా--అక్కడికక్కడ మాటలనుకుని ఆడేవి. వీటిలో ఎలక్షన్ నాటకాలు, కలక్షన్నాటకాలు, కంట్రాక్టు నాటకాలు (నువ్వనుకునీవి కావు. రోడ్లు, వంతెనలు, ప్రాజెక్టులు, ఆఫీసులు, ఆస్పత్రులూ కట్టే కంట్రాక్టు నాటకాలే) సాహిత్య సంగీత నాటక పరిషన్నాటకాలు, ఉద్యోగ విజయాలు (నువ్వనుకునే తిరుపతి వెంకట కవులవి కావు)--ఇవి వేరు.

...ఓయ్ చోటయి పోయింది. భావాలు క్రిక్కిరిసి పోతున్నాయి. ఇవాల్టికి లెక్చరాపి నీలాటి రేవుకెళ్ళి, ఎనాటిమీ--అనగా సుందర శరీరశాస్త్రం, స్టడీ చేదాం గాని అమ్మనడిగి ఓ పావలా పట్రా సిగార్పుకుంటుంది.

